

నీట్ రాష్ట్రానికి గొడ్డలిపెట్టు

- ఈ పరీక్షలతో ఓ వర్గానికి మాత్రమే ప్రయోజనం
- పన్నుల వసూళ్లలోనూ పక్షపాతమే
- కేంద్రానిది మొండివైఖరి
- కేంద్రంతో సత్సంబంధాల కోసం ఉన్నతస్థాయి కమిటీ
- అసెంబ్లీలో సీఎం స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, ఆర్థిక తారతమ్యాలు, అణగారిన ప్రజలకు అవకాశాలను మెరుగుపరచటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర విద్యావిధానంతో నాణ్యమైన వైద్య విద్యనందించిన రాష్ట్రానికి నీట్ గొడ్డలిపెట్టుగా మారిందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం అసెంబ్లీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ... నీట్ ఓ వర్గానికి చెందినవారికే మాత్రమే ప్రయోజనం కలిగిస్తున్నాయన్నారు. అంతేకాకుండా శిక్షణ కేంద్రాలు ఫీజుల రూపంలో కోట్లు గడించేందుకే దోహదపడుతున్నాయని ఆరోపించారు. కేంద్రం జీఎస్టీని అమలు చేసేందుకు ప్రయత్నించినప్పుడు ఆ విధానాన్ని రాష్ట్రం తీవ్రంగా వ్యతిరేకించిందని, ఆ విధానం అమలులోకి వచ్చాక ఇక్కడి నుండే అధికంగా పన్నుల రూపంలో కేంద్రానికి ఆదాయం విపరీతంగా పెరిగిందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పన్నుల రూపంలో కేంద్రానికి ఒక రూపాయి చెల్లిస్తే, అందులో 29 పైసలను మాత్రమే రాష్ట్రానికి నిధుల పేరుతో విడుదల చేస్తోందనే విషయాన్ని అందరూ గ్రహించాలన్నారు. జాతీయ విద్యావిధానాన్ని అంగీకరించకుంటే సర్వ శిక్షా అభియాన్ పథకం కింద రాష్ట్రానికి విడుదల చేయాల్సిన రూ.2500 కోట్లను విడుదల చేయకుండా కేంద్రం మొండి వైఖరిని అవలంబిస్తోందని, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఆ నిధులను విడుదల చేయాలని ఆదేశించినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని స్టాలిన్ ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర గవర్నర్ యేళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచిన కీలకమైన 10 బిల్లుల ఆమోదం కోసం తమ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించి చక్కటి తీర్పు సాధించుకోగలిగిందని, ఆ తీర్పు దేశంలోని అన్ని రాష్ట్రాల గవర్నర్లకు వర్తిస్తుందన్నారు. ఇలా ప్రతి విషయానికి కోర్టులను ఆశ్రయించడం కంటే కేంద్రం, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు మెరుగుపరచటం మంచిదని తమ ప్రభుత్వం భావిస్తోందని, ఆ దిశగానే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఆ కమిటీలో సభ్యులుగా ఇండియన్ మారిటైమ్ వర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎం.నాగనాథన్ సభ్యులుగా ఉంటారని తెలిపారు.

1971లో ఏర్పాటైన రాజమన్నార్ కమిటీ సిఫారసులను కూడా పరిశీలనలోకి తీసుకుని వచ్చే జనవరిలో మధ్యంతర నివేదికసమర్పిస్తుందని, రెండేళ్లలో సమగ్రమైన నివేదిక సమర్పిస్తుందని మంగళవారం ఉదయం అసెంబ్లీలో 110వ నిబంధన కింద స్టాలిన్ ఈ ప్రకటన చేశారు.

దేశంలోనే మొదటిసారిగా కేంద్ర రాష్ట్రాల సంబంధాలపై సమీక్షించి 1971లో సమగ్రమైన నివేదికను సమర్పించిందని స్టాలిన్ చెప్పారు. ఆ కమిటీ నివేదికను 1974 ఏప్రిల్ 16న శాసనసభలో తీర్మానంగాను కరుణానిధి ప్రవేశపెట్టి ఆమోదింపజేశారని చెప్పారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం కూడా కేంద్ర, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను పటిష్ఠపరిచే దిశగా 1983లో సర్కారియా కమిషన్ ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ వేలాది పుటల నివేదికను కేంద్రానికి సమర్పించినప్పటికీ కేంద్ర, రాష్ట్రాల నడుమ చెప్పుకోదగిన సత్సంబంధాలు మెరుగు పడలేదన్నారు. అదే సమయంలో రాష్ట్రాలకు ఉన్న హక్కులు ఒక్కొక్కటికీ హరించుకుపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇక జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పేరుతో నియోజక వర్గాల సంఖ్య బాగా తగ్గించి పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు తగిన ప్రాధాన్యత లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



జస్టిస్ కురియన్ జోసెఫ్ కమిటీ ఏర్పాటుపై శాసనసభలో ప్రకటన చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

1969లోనే...

ఇటీవలి కాలంలో రాష్ట్రాలకున్న ప్రధాన హక్కులను కేంద్రం హరించివేస్తోందని, దీంతో రాష్ట్ర ప్రజల ప్రాథమిక హక్కుల కోసం కేంద్రంతో పోరాడాల్సి వస్తోందన్నారు. ఐదు దశాబ్దాల క్రితమే 1969లో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి కేంద్ర, రాష్ట్రాల నడుమ సంబంధాలను సమీక్షించడానికి విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పీవీ రాజమన్నార్ నాయకత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు..



234 నియోజకవర్గాల్లో
విజయ్ సేన సర్వే

- డీఎంకే పాలనలో లోపాలేంటి?
- తమ అధినేతపై విశ్వాసానికి కారణాలు?
- ఇంటింటి సర్వే చేస్తున్న టీవీకే మహిళా నేతలు

అడయార్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్రహీరో విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం విజయావకాశాలు, మా పార్టీ అధినేతపై నమ్మకం ఎంత, డీఎంకే పాలనలో లోటుపాట్లు తదితర అంశాలపై టీవీకే మహిళా నేతలు ఇంటింటి సర్వేలో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో ఈ సర్వే చేస్తున్నారు. ఇందుకోసం టీవీకే ప్రధాన కార్యాలయం ముద్రించిన ప్రత్యేక ఫారంలోని వివరాలకు అనుగుణంగా ప్రతి ఇంటికి వెళ్ళి వివరాలను సేకరిస్తున్నారు.

గత 50 యేళ్ళ ద్రవిడ పార్టీల పాలనలో రాష్ట్రంలో జరిగిన పరిణామాలు? ఏం జరగలేదు? ఈ ద్రావిడ పాలన మీకు నచ్చిందా? నచ్చలేదా? ఒక వేళ నచ్చితే మీకు నచ్చిన అంశాలు ఏంటి? దానికి కారణం ఏంటి? నచ్చలేదు అంటే ఎందుకు నచ్చలేదు? వంటి ప్రశ్నలకు సమాధానాలు అడుగుతున్నారు. అదేవిధంగా హీరో విజయ్ రాజకీయాల్లోకి రావడాన్ని మీరు స్వాగతిస్తారా? లేదా?, విజయ్‌ను ఆదరిస్తూ ఓటు వేస్తారా? రాష్ట్రంలో ప్రభుత్వ మార్పిడికి ఇష్టపడుతున్నారా? వంటి ప్రశ్నలు వేస్తున్నారు. అలాగే, ఆ కుటుంబంలో ఎంతమందికి ఓటు హక్కు ఉంది? మొబైల్ నంబరు తదితర వివరాలను కూడా సేకరిస్తున్నారు. వివరాలను సేకరించి వెళ్ళే ఆ ఇంటి గుమ్మానికి విజయ్ బొమ్మ స్టిక్కర్ అంటిస్తున్నారు. ఈ తరహా సర్వే 234 నియోజకవర్గాల్లోని 68,320 పోలింగ్ బూత్ పరిధిలో నిర్వహించి, పూర్తి వివరాలను ఆ పార్టీ ప్రధాన కార్యాలయానికి అందజేయనున్నారు. ఇదిలావుంటే, వచ్చే ఎన్నికల్లో విజయ్ సొంతంగా పోటీ చేయనున్నారనే ప్రచారం సాగుతోంది. మరోవైపు అన్నాడీఎంకే - బీజేపీ కూటమి ఎన్నికల్లో పోటీ చేయనుంది. అధికార డీఎంకే తన భాగస్వామ్య పార్టీలతో కలిసి పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో విజయ్ సారథ్యంలోని టీవీకే రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై సర్వే చేయిస్తోంది.

ముగ్గురు మంత్రులపై
అవిశ్వాస తీర్మానానికి పట్టు

- నిరాకరించిన స్పీకర్
- అన్నాడీఎంకే-బీజేపీ వాకౌట్

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, కె.పొన్ముడి, సెంథిల్‌బాలాజీపై అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అనుమతి నిరాకరించిన స్పీకర్ అప్పావు వైఖరిని ఖండిస్తూ అన్నాడీఎంకే సభ్యులు, ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి అంటూ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుపై ప్రకటన చేయడాన్ని ఖండిస్తూ బీజేపీ సభ్యులు శాసనసభ నుండి వాకౌట్ చేశారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయం ముగియగానే ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే సభాపక్ష ఉపనాయకుడు ఆర్బీ ఉదయకుమార్ లేచి ముగ్గురు మంత్రులపై అవిశ్వాసతీర్మాన ప్రవేశపెట్టేందుకు తాము ఇచ్చిన నోటీసు ఏమైందంటూ స్పీకర్‌ను ప్రశ్నించారు. అంతేగాక దానిపై ఆయన మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా, స్పీకర్ అప్పావు జోక్యం చేసుకుని.. ముఖ్యమంత్రి 110వ సభా నిబంధన కింద ప్రకటన చేయనున్నారని, ఆ సమయంలో సభ్యులెవరూ మాట్లాడకూడదని తెలిపారు. దీంతో అన్నాడీఎంకే సభ్యులంతా లేచి ఉదయకుమార్‌ను మాట్లాడేందుకు అనుమతించాలని నినాదాలు చేశారు. అదే సమయంలో ఉదయకుమార్ మైక్ కట్ అయింది. దీంతో ఆగ్రహించిన అన్నాడీఎంకే ఎమ్మెల్యేలంతా ఉదయకుమార్ నాయకత్వంలో సభ నుండి వాకౌట్ చేశారు.

బీజేపీ వాకౌట్...

కేంద్రం ద్వారా కోల్పోయిన హక్కులను మళ్ళీ పొందుదామంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయం ప్రతిపత్తి దిశగా ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ సభ్యులు వాకౌట్ చేశారు. డీఎంకే ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి పేరుతో కొత్త కమిటీని ఏర్పాటు చేయడం గర్హనీయమని, దీనిని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, బీజేపీ సభాపక్ష నాయకుడు నయినార్ నాగేంద్రన్ శాసనసభలో ధ్వజమెత్తారు. గతంలో సభా నిబంధన 110 కింద దశాబ్దాల తరబడి కొనసాగుతున్న ముల్లై పెరియార్ డ్యామ్, కావేరి నదీ జలాల వివాదం, జీఎస్టీ, ద్విభాషా విద్యావిధానం వంటి సమస్యలపై ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన ప్రకటనలు సమంజసంగానే ఉన్నప్పటికీ, ఉన్నట్టుండి రాష్ట్రాల హక్కులన్నీ హరించుకుపోయినట్లు హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక జీఎస్టీపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేయడం కూడా వింతగా ఉందన్నారు. వెంటనే మంత్రి పళనివేల్ త్యాగరాజన్ జోక్యం చేసుకుని జీఎస్టీలో 50 శాతం నిధులు రావటం లేదని, 30 నుండి 40 శాతం వరకూ మాత్రమే జాప్యంగా విడుదల చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి స్టాలిన్ జోక్యం చేసుకుని నయినార్ నాగేంద్రన్ మాట్లాడేటప్పుడే 'తనకు తెలిసినంతవరకూ' అనే పదాన్ని ఉపయోగించారని, కనుక ఆయన సభకు తప్పుడు సమాచారం అందించినట్లు పరిగణించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. అంతేగాక ప్రస్తుతం నయినార్ నాగ్రేందన్ పార్టీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారని, ఆ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నానని చెప్పారు. వెంటనే స్పీకర్ అప్పావు కూడా నయినార్ నాగేంద్రన్‌కు అభినందలు తెలిపారు. సీఎంకు, స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపిన నయినార్ నాగేంద్రన్ గతంలో తాను కొవిడ్ కారణంగా అస్వస్థత చెందినప్పుడు కూడా స్టాలిన్ పరామర్శించారని గుర్తు చేసుకున్నారు. అంతేకాకుండా బీజేపీ అధ్యక్షుడిగా ఎంపికైనందుకు స్టాలిన్ ఫోన్ చేసి మరీ శుభాకాంక్షలు తెలిపారని పేర్కొన్నారు. త్రిభాషా విద్యావిధానం పేరుతో హిందీని నిర్బంధంగా అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించడం తగదని, రాష్ట్రంలో తెలుగు ప్రజలు అధికంగా ఉన్నారని, కన్నియాకుమారి జిల్లాలో మలయాళీలు అధికంగా ఉన్నారని, శాసనసభలో మాజీ శాసనసభ్యుడు గోపీనాథ్ తెలుగులో ప్రశ్నలడిగితే అప్పటి సీఎం జయలలిత తెలుగులోనే సమాధానమిచ్చిన విషయాలు సభ రికార్డులలో ఉన్నాయని గుర్తు చేశారు ఇలా అన్ని భాషాలను ఆదరించడం మంచిదే కదా అని పేర్కొన్నారు. ఇక రాష్ట్రాల హక్కుల సాధనకోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించడం గర్హనీయమన్నారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు పెంచే దిశగా గతంలో ఏర్పాటైన కమిటీల నివేదికల వివరాలు, వాటి సిఫారసుల అమలు తదితర వివరాలను ముఖ్యమంత్రి వెల్లడించగలరా? అంటూ నయినార్ నాగేంద్రన్ ప్రశ్నించారు. డీఎంకే పాలన ముగియడానికి సమయం దగ్గరపడుతుండగా ఇలాంటి కపటనాటకాలేందుకని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ ఏర్పాటును తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొంటూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఆ ముగ్గురినీ తొలగించాల్సిందే
● ఆర్బీ ఉదయకుమార్

అసెంబ్లీ వెలుపల ఆర్బీ ఉదయకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు కేఎన్ నెహ్రూ, సెంథిల్‌బాలాజీ, పొన్ముడిపై సభా నిబంధన 72 ప్రకారం అవిశ్వాసతీర్మానం ప్రవేశపెట్టి చర్చించేందుకు అనుమతించాలని స్పీకర్ అప్పావుకు విజ్ఞప్తి చేశామని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు మంత్రులపై జీరో అవర్‌లో చర్చించాలని స్పీకర్‌కు లేఖ కూడా ఇచ్చామన్నారు. స్పీకర్ ఇలా పక్షపాతధోరణితో వ్యవహరిస్తుండటాన్ని ఖండిస్తూ సభ నుండి వాకౌట్ చేసినట్లు వివరించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు స్వయప్రతి పత్తి తీర్మానం పేరుతో కమిటీ ఏర్పాటుపై ప్రకటన చేయడం కంటి తుడుపు చర్యేనని ఉదయకుమార్ విమర్శించారు.



అసెంబ్లీ వెలుపల మీడియాతో మాట్లాడుతున్న ఆర్బీ ఉదయకుమార్

మాజీ మంత్రి రాజేంద్రపై చర్యలకు
గవర్నర్ గ్రీన్‌సిగ్నల్




మాజీమంత్రి రాజేంద్ర బాలాజి

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆవిన్ సంస్థలో ఉద్యోగాలిప్పిస్తామని నగదు మోసానికి పాల్పడిన కేసులో, అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీమంత్రి రాజేంద్ర బాలాజీపై చర్యలు చేపట్టేందుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విరుదునగర్ జిల్లా సాత్తూర్‌కు చెందిన ఎస్.రవీంద్రన్ సోదరి కుమారుడికి ఆవిన్ సంస్థలో మేనేజర్‌గా ఉద్యోగం కల్పిస్తామని రూ.30 లక్షలు తీసుకుని మోసం చేశారంటూ మాజీ పాడి పరిశ్రమ అభివృద్ధిశాఖ మంత్రి రాజేంద్ర బాలాజీ, విజయ నల్లతంబి, మారియప్పన్ తదితరులపై విరుదునగర్ జిల్లా నేర విభాగం పోలీసులు 2021లో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి అజ్ఞాతంలోకి వెళ్లిన రాజేంద్ర బాలాజీని కర్ణాటక రాష్ట్రంలో అరెస్ట్ చేసారు. అనంతరం ఆయన బెయిలుపై విడుదలయ్యారు. అదే సమయంలో, రాజేంద్ర బాలాజీ మరో 33 మందికి ఆవిన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.3 కోట్ల వరకు మోసానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఈ కేసుకు సంబంధించిన ఛార్జిషీటు విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ న్యాయస్థానంలో జనవరి 9వ తేది దాఖలుచేశారు. ఈ క్రమంలో, ఈ కేసు విచారణ సీబీఐకి మార్చాలంటూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. అలాగే, అనువదించిన దస్తావేజులను రెండు వారాల్లో గవర్నర్ అనుమతికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిన అత్యున్నత న్యాయస్థానం.. పెండింగ్‌లో ఉన్న ఆమోదంపై సత్వరం నిర్ణయం తీసుకోవాలని రాజ్‌భవన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీపై నమోదైన కేసులో చర్యలు చేపట్టేందుకు గవర్నర్ ఆమోదం తెలిపారని, ఒకటి, రెండు రోజుల్లో ఆయనపై ఛార్జిషీటు దాఖలుచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది.

విద్యుత్ బోర్డుకు నష్టాల షాకులు !

- స్థానిక సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల బకాయిలే రూ.5,135 కోట్లు



చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్‌ఈబీ) పరిస్థితి 'మూలిగే నక్కపై తాటికాయ పడిన' చందంగా తయారైంది. అసలే నష్టాల్లో ఉన్న టీఎన్‌ఈబీకి ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు మాత్రమే రూ.5,135 కోట్లు చెల్లించాల్సి ఉండడంతో, బకాయిల వసూలు తలనొప్పిగా మారింది. ఈ బకాయిలు వసూలైతే టీఎన్‌ఈబీ నష్టాల నుంచి కొంత ఉపశమనం కలిగే అవకాశముంది. టీఎన్‌ఈబీకి 2.33 కోట్ల గృహ కనెక్షన్లు, 7.55 లక్షల కర్మాగారాల కనెక్షన్లు, సహా మొత్తం 3.24 కోట్ల విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఇది మినహా సుమారు 10 వేలకు పైగా హైటెన్షన్ విభాగం కనెక్షన్లున్నాయి. ఈ కనెక్షన్లలో గృహ కనెక్షన్లకు రెండు నెలలకు ఒకసారి, కర్మాగారాలు, వాణిజ్య సంస్థలకు నెలకు ఒకసారి చొప్పున విద్యుత్ చార్జీలు వసూలు చేస్తుంటారు. అలాగే, స్థానిక సంస్థలైన కార్పొరేషన్లు, పట్టణ పంచాయతీలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీలకు టీఎన్‌ఈబీ విద్యుత్ కనెక్షన్లు అందిస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, వాటర్ బోర్డు తదితరాలతో పాటు ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు కూడా విద్యుత్ కనెక్షన్లున్నాయి. వీటిలో స్థానిక సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి విద్యుత్ చార్జీలు వసూలుకావడం లేదు. ఆ ప్రకారం, 5.59 స్థానిక సంస్థలు, 88,518 ప్రభుత్వ కార్యాలయాల నుంచి వసూలుకావాల్సిన సుమారు రూ.5,135.47 కోట్లు బకాయిలుగా ఉన్నాయి.

ఈరోడ్ జోన్‌లో అధికం...

స్థానిక సంస్థల విభాగంలో ఈరోడ్ జోన్‌లోని 1.09 లక్షల విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి రూ.985 కోట్లు బకాయిలున్నాయి. తిరుచ్చి జోన్‌లో 1.35 లక్షల కనెక్షన్లకు రూ.907 కోట్లు, చెన్నై జోన్ పరిధిలోని 27,017 కనెక్షన్లలో ఒక కనెక్షన్‌కు సరాసరిన రూ.1.38 లక్షల చొప్పున మొత్తం రూ.375 కోట్లు బకాయిలున్నాయి. దీంతో, నష్టాలు వస్తున్నాయనే కారణంగా టీఎన్‌ఈబీ, ఇటీవల విద్యుత్ చార్జీలు పెంచింది. ముఖ్యంగా గృహ కనెక్షన్ల విభాగంలో చార్జీలు రూ.2.50 నుంచి రూ.4.50కి పెంచింది. అలాగే, 100 యూనిట్లు నుంచి 1,000 యూనిట్లు వరకు ఉన్న అన్ని విభాగాల్లో చార్జీలు పెంచారు.

ప్రభుత్వ కార్యాలయాలకు లేఖలు..

స్థానిక సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి సుమారు రూ.5,135 కోట్లు బకాయిలు వసూలుకావాల్సి ఉంది. వాటిల్లో స్థానిక సంస్థల బకాయిలు రూ.2,813 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.2,286 కోట్లు. బడ్జెట్‌లో స్థానిక సంస్థలకు నిధులు కేటాయిస్తుండగా, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన విద్యుత్ చార్జీలు కూడా ప్రభుత్వం విడుదల చేస్తోంది. కానీ, కేటాయించిన నిధులను టీఎన్‌ఈబీకి సక్రమంగా చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు చెల్లించాలని లేఖలు కూడా రాశామని, అయినా అటు నుంచి స్పందన ఉండడం లేదని అధికారులు వాపోతున్నారు.

దేవాదాయశాఖ ఆధ్వర్యంలో
ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ



కొత్తగా ముద్రించిన ఆధ్యాత్మిక పుస్తకాలను సచివాలయంలో ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అరుదైన 300 ఆధ్యాత్మిక పుస్తకాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ఆవిష్కరించారు. తిరుప్పేరూరు పురాణం, పాపనాశ స్థలం, శివపురాణం, మహాభారతం, కంబ రామాయణం సహా ఆధ్యాత్మిక పరిశోధనలకు ఉపయోగపడే ఆధ్యాత్మిక పుస్తకాలు సహా మొత్తం 300 పుస్తకాలను దేవాదాయ శాఖ ముద్రించిందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పీకే శేఖర్‌బాబు, అన్బిల్‌మహేష్ పొయ్యామొళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పర్యాటక దేవాదాయ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, ఆ శాఖ సలహామండలి సభ్యుడు, ప్రముఖ ప్రవచనకర్త సుకి శివమ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికలకు ఈసీ ఏర్పాట్లు

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఆరు రాజ్యసభ స్థానాల భర్తీ కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ప్రారంభించింది. ఈ ఎన్నికలకు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టమంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి వర్తమానం కూడా పంపింది. రాష్ట్రం తరఫున 18 మంది రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఆరుగురి పదవీకాలం ముగియనుంది. డీఎంకేకు చెందిన అబ్దుల్లా, షణ్ముగం, విల్సన్‌తో పాటు, అన్నాడీఎంకే ఎంపీ చంద్రశేఖర్, ఎండీఎంకే నేత వైగో, పీఎంకే నేత అన్బుమణి పదవీకాలం జూలై 24తో ముగుస్తుంది.. దీంతో రాష్ట్రం నుంచి ఆరుగురిని రాజ్యసభకు ఎంపిక చేయాల్సి ఉంది. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఉప ఎన్నికలతో పాటు, రాష్ట్రంలో రాజ్యసభకు ఎన్నికల ప్రకటన వస్తుందని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

సమాచార దృష్టి

ముగిసిన టెన్త్ పరీక్షలు

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్రస్తుత విద్యా సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు గత నెల 28న ప్రారంభం కాగా, సుమారు 9 లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు పరీక్షలు మంగళవారంతో ముగియడంతో జవాబుపత్రాలను ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య మూల్యాంకనం చేపట్టనున్న కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. మూల్యాంకన పనులు ఈ నెల 22 నుంచి 30వ తేది వరకు జరుగనున్నాయి. మార్కులు గణన, జాబితా తయారీ పూర్తిచేసి గతంలో ప్రకటించినట్టుగా మే 19న ఫలితాలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది.

త్వరలో ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల నోటిఫికేషన్

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు సంబంధించి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ కింద పేద కుటుంబాల పిల్లలకు కేటాయించారు. రాష్ట్రంలో ఈ విధానం 2013 నుంచి ప్రారంభం కాగా ఇప్పటివరకు ఈ పథకంలో సుమారు 5 లక్షల మంది విద్యార్థులు లబ్ధిపొందారు. రాష్ట్రంలో సుమారు 8వేలలకు పైగా పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు సుమారు 1.1 లక్షలున్నాయి. ఎల్కేజీ, 1వ తరగతిలో చేరే విద్యార్థులు 8వ తరగతి వరకు ఉచితంగా చదువుకోవచ్చు. విద్యార్థుల ఫీజు రాష్ట్ర ప్రభుత్వం ఆయా పాఠశాలలకు చెల్లిస్తుంది. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లోని ఉచిత సీట్ల అడ్మిషన్ నోటిఫికేషన్ త్వరలో విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

20న ఎండీఎంకే కార్యనిర్వాహక సమావేశం

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎండీఎంకే కార్యానిర్వాహక సమావేశం ఈ నెల 20వ తేది జరుగనుంది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో విడుదల చేసిన ప్రకటనలో... ఎగ్మూర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పార్టీ ప్రిసీడియం ఛైర్మెన్ అర్జునరాజ్ అధ్యక్షత జరుగనున్న సమావేశంలో పార్టీ బలోపేతానికి చర్యలు, అసెంబ్లీ ఎన్నికలకు సమాయాత్తం సహా పలు అంశాలపై చర్చించనున్నట్లు వైగో తెలిపారు.

ఉన్నత విద్యలో 30 శాతం పెరిగిన ప్రవేశాలు

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గడచిన మూడేళ్లలో ఉన్నత విద్యలో చేరే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 30 శాతం పెరిగారని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. 2021-22వ విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యలో చేరే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య కేవలం 45 శాతం మాత్రమే ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన 'పుదుమై పెన్' పథకంలో 2022-23వ సంవత్సరంలో చేరేవారి సంఖ్య 69 శాతానికి పెరిగింది. 2022-23 విద్యా సంవత్సరంలో ప్లస్ టూ ఉత్తీర్ణులైన 3,97,809 మందిలో 2,72,744 మంది విద్యార్థులు ఉన్నత విద్యలో చేరారు. అలాగే, 2023-23 సంవత్సరంలో 3,34,723 మంది విద్యార్థుల్లో 2,47,744 మంది విద్యార్థులు ఉన్నత విద్యలో చేరారు. వీరిలో అధిక శాతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులున్నారని తెలిపారు.

నేటినుంచి కంప్యూటర్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కంప్యూటర్ పరీక్షకు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని సాంకేతిక విద్య డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది కొత్త సిలబస్‌తో జూన్‌లో ఈ పరీక్ష జరుగనుంది. పరీక్షా ఫీజుగా రూ.1,030 చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తులు www.tndtegteonline.in అనే వెబ్‌సైట్‌లో సమర్పించాలి. మరిన్ని వివరాలకు www.dte.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో టైపిస్ట్, షార్ట్ హ్యాండ్ టైపిస్ట్ పోస్టులకు ప్రభుత్వ కంప్యూటర్ సర్టిఫికెట్ పరీక్షలో ఉత్తీర్ణులు కావడం తప్పనిసరి చేశారు. గ్రూప్-4 పోస్టుల భర్తీ, పర్యాటక శాఖలో టూరిజం ఆఫీసర్, అసిస్టెంట్ టూరిజం ఆఫీసర్ తదితర పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ నిర్వహించే పరీక్షలకు ప్రభుత్వ కంప్యూటర్ పరీక్ష ఉత్తీర్ణులైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, అసిస్టెంట్ పోస్టులకు ప్రభుత్వ కంప్యూటర్ సర్టిఫికేట్ పరీక్షలో ఉత్తీర్ణత తప్పనిసరి చేశారు.

21న రవాణా కార్మికుల ఆందోళన

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేతనాల పెంపు సహా పలు డిమాండ్ల సాధన కోసం రవాణా కార్మిక సంఘాలు ఈ నెల 21న ఆందోళన చేపట్టనున్నాయి. ఈ మేరకు సీఐటీయూ, ఏఐటీయూసీ, టీటీఎస్ఎఫ్ తదితర కార్మిక సంఘాలు విడుదల చేసిన ప్రకటనలో... మాజీ రవాణా ఉద్యోగుల డీఏ పెంపు కేసు కోర్టు విచారణలో ఉందని, కానీ ప్రభుత్వం పలు కారణాలు చెబుతూ తీర్పు వాయిదా వేయిస్తోందని విమర్శించారు. మాజీ ఉద్యోగులకు పింఛన్ అందించడం, వేతన పెంపు చర్చలను ప్రభుత్వం జాప్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 21వ తేది ఉదయం 10 గంటలకు పల్లవన్ రోడ్డులోని సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు ఆయా సంఘాలు ప్రకటించాయి.

గంటలో తంజావూరు-కుంభకోణం ప్రయాణం

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి కుంభకోణం-తంజావూరు-కుంభకోణం మధ్య బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. 50 కి.మీ దూరం గంటలో చేరేలా ఏర్పాటుచేసిన ఈ బస్సుల్లో ఒకరికి రూ.40 ఛార్జీ నిర్ణయించారు. కుంభకోణం నుంచి తెల్లవారుజామున 5 నుంచి రాత్రి 10 గంటల వరకు, తంజావూరు నుంచి తెల్లవారుజామున 5.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు గంటకు బస్సులు నడుపనున్నారు. బైపాస్ రోడ్డు మీదుగా సాగే ప్రయాణంలో పర్యాటకులు తక్కువ సమయంలోనే గమ్యస్థానాలకు చేరుకుంటారని అధికారులు తెలిపారు.

బ్రాడ్‌వేలో గుడిసెల తొలగింపు



పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడ్‌వే ప్రాంతంలో 55 గుడిసెలను అధికారులు తొలగించారు. 60 ఏళ్ల చరిత్ర కలిగిన బ్రాడ్‌వే బస్టాండ్ తొలగించి, రూ.822.70 కోట్లతో మల్టీ పర్పస్ ఇంటిగ్రేటెడ్ బస్టాండ్‌గా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం ప్రస్తుతమున్న బ్రాడ్‌వే బస్టాండ్ కూల్చివేత పనులు ప్రారంభమైన నేపథ్యంలో, అందుకు ప్రత్యామ్నాయంగా రాయపురం ఫై ఓవర్ సమీపంలో రూ.7 కోట్లతో తాత్కాలిక బస్టాండ్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. బ్రాడ్‌వే బస్టాండ్ కూల్చివేత పనుల్లో భాగంగా తొలివిడతగా చుట్టూ ఉన్న 55 గుడిసెలు తొలగించేందుకు అధికారులు చేపట్టారు. అక్కడ నివసిస్తున్న వారికి ఎలిఫెంట్ గేట్, వాల్‌టాక్స్ రోడ్డు, వాటర్ ట్యాంక్ వీధి ప్రాంతాల్లో నిర్మించిన అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు నిర్మించిన అపార్ట్‌మెంట్లలో గృహాలు కేటాయించారు. రెండవ విడతగా మరిన్ని దుకాణాలు తొలగించే పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

జెమినీ ఫ్లై ఓవర్‌పై మొరాయించిన బస్సు

● రెండు గంటలు ట్రాఫిక్ జాం

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలైలోని జెమినీ ఫ్లై ఓవర్‌పై ఎంటీసీ బస్సు మరమ్మతులకు గురై నిలిచిపోవడంతో, ఆ మార్గంలో సుమారు రెండు గంటలు ట్రాఫిక్ స్తంభించింది. ఎండ తీవ్రత అధికంగా ఉండంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనచోదకులు అల్లాడిపోయారు. అన్నాసాలై మార్గం ఎప్పుడూ వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో, మంగళవారం ఉదయం అయనావరం నుంచి బీసెంట్ నగర్ (నెం.23సి) బస్సు మరమ్మతులకు గురై జెమినీ ఫ్లై ఓవర్ మధ్యలో నిలిచిపోయింది. దీంతో, ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ గజేంద్రన్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు శ్రమించారు. ఫ్లై ఓవర్‌పై నిలిచిన బస్సుల్లోని ప్రయాణికులను కిందకు దింపి మరో బస్సులో పంపించారు. రెండు గంటల అనంతరం మరమ్మతులకు గురైన బస్సును అక్కడి నుంచి కదిలించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డు ఆస్తులపై డిజిటల్ సర్వే జరపాలి

● టీఎంఎంఎల్ నేత షేక్‌దావూద్



చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులపై డిజిటల్ సర్వే చేయించాలని తమిళ్ మానిల ముస్లిమ్‌లీగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.షేక్ దావూద్ డిమాండ్ చేశారు. నగరంలో ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన వక్ఫ్ చట్టాన్ని తమ పార్టీ స్వాగతిస్తుందని ప్రకటించారు. వక్ఫ్ ఆస్తులు ఏయే ప్రాంతాల్లో దురాక్రమణలకు గురై దుర్వినియోగమవుతున్నాయో ఆయా ప్రాంతాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త వక్ఫ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఇక తమ పార్టీ ఆధ్వర్యంలో కొత్త వక్ఫ్ బిల్లుపై 'వక్ఫ్ ఫార్ ది ఉమ్మాహ్' పేరుతో అవగాహన ప్రచారం చేయనున్నట్లు కూడా ఆయన తెలిపారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుపుతున్న ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.06012 నాగర్‌కోయిల్-తాంబరం వారాంతపు ప్రత్యేక రైలు (ఆదివారం) మే 11 నుంచి జూన్ 1వ తేది వరకు, మరుమార్గంలో నెం.06011 తాంబరం-నాగర్‌కోయిల్ వారాంతపు ప్రత్యేక రైలు (సోమవారం) మే 12 నుంచి జూన్ 2వ తేది వరకు (తలా నాలుగు సర్వీసులు) పొడిగింపు.

● నెం.06035 తాంబరం-తిరువనంతపురం నార్త్ వారాంతపు ప్రత్యేక రైలు (శుక్రవారం) జూన్ 9 నుంచి 30వ తేది వరకు, మరుమార్గంలో నెం.06036 తిరువనంతపురం నార్త్-తాంబరం వారాంతపు ప్రత్యేక రైలు (ఆదివారం) మే 11 నుంచి జూన్ 1వ తేది వరకు (తలా నాలుగు సర్వీసులు) పొడిగింపు.

● నెం.06030 తిరునల్వేలి-మేట్టుపాళయం వారాంతపు ప్రత్యేక రైలు (ఆదివారం) మే 11 నుంచి జూన్ 1వ తేది వరకు, మరుమార్గంలో నెం.06029 మేట్టుపాళయం-తిరునల్వేలి వారాంతపు ప్రత్యేక రైలు (సోమవారం) మే 12 నుంచి జూన్ 2వ తేది వరకు (తలా నాలుగు సర్వీసులు) పొడిగింపు.

బయో మెడికల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (డిఎంఈఆర్) ఆధ్వర్యంలో 'కలైంజ్ఞర్ సెంటినరీ ఇంటిగ్రేటెడ్ బయో మెడికల్ రీసెర్చ్ ఫౌండేషన్' ఏర్పాటుకు తమిళనాడు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ. 10 లక్షల వన్ టైమ్ గ్రాంట్ మంజూరు చేశారు. వ్యాధులను అర్థం చేసుకోవడం, టెస్టులు, నివారణ, వ్యక్తిగతీకరించిన చికిత్స, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి లక్ష్యంగా ఈ ఫౌండేషన్ పనిచేస్తుందని డీఎంఈఆర్ స్పష్టం చేసింది. దీనిని వైద్య విద్య పరిశోధనల డైరెక్టర్ (ఎక్స్-అఫీషియో) అధ్యక్షతన ఉన్న పాలకమండలి నిర్వహించనుంది. సీనియర్ వైద్యులు కౌన్సిల్‌కు నామినేట్ చేయబడతారు. ఈ ఫౌండేషన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి, కార్పొరేట్ సంస్థల నుండి నిధులు మరియు గ్రాంట్లను పొందనుంది.

ఆస్పత్రిలో చేరిన దిండిగల్ శ్రీనివాసన్

అడయార్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి దిండిగల్ శ్రీనివాసన్ ఉన్నట్టుండి అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేరారు. ఆ పార్టీ కోశాధికారిగా ఉన్న శ్రీనివాసన్ చెన్నైలో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఉన్నట్టుండి అస్వస్థతకు లోనుకావడంతో ఆయనను థౌజండ్‌లైట్‌లోని అపోలో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అజీర్ణ సమస్యల కారణంగా అస్పత్రిలో చేరారని ఒకటి రెండు రోజుల్లో ఆయన డిశ్చార్జ్ అవుతారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

కళ్లకుర్చి సారా కేసు విచారణ మూడు నెలల్లో పూర్తిచేస్తాం

● హైకోర్టుకు తెలిపిన సీబీఐ

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చిలో నకిలీ సారా తాగి మృతిచెందిన ఘటన కేసు విచారణ మూడు నెలల్లో పూర్తిచేస్తామని మద్రాస్ హైకోర్టుకు సీబీఐ నివేదించింది. కళ్లకుర్చి జిల్లా కరుణాపురంలో గత ఏడాది నకిలీ సారా తాగి 67 మంది మృత్యువాతపడిన విషయం తెలిసిందే. ఈ కేసులో నకలీ సారా విక్రయం, తరలింపు వంటి వ్యవహారాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న 21 మందిని అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఈ కేసు విచారణ సీబీఐ చేపట్టింది. ఈ కేసులో అరెస్టయిన కన్నుకుట్టికి చెందిన గోవిందరాజ్, దామోదరన్ బెయిలు మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్లపై న్యాయమూర్తి సుందర్‌మోహన్ విచారణ చేపట్టారు. ఆ సమయంలో సీబీఐ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నకిలీ సారా కేసుకు సంబంధించిన విచారణ మూడు నెలల్లో పూర్తిచేస్తామని, ఈ కేసులో ప్రధాన నిందితులైన గోవిందరాజ్, దామోదరన్‌లకు బెయిలు మంజూరు చేయవద్దని అభ్యర్థించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్పందిస్తూ.. ఈ కేసు దర్యాప్తుపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదావేశారు.

2న అన్నాడీఎంకే కార్యనిర్వాహక మండలి సమావేశం

● అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే కార్యనిర్వాహక మండలి సమావేశం మే 2న నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. వచ్చే యేడాది జరుగనున్న రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో మెగా కూటమి ఏర్పాటు చేసుకుని పోటీకి దిగాలని ఈపీఎస్ భావిస్తున్నారు. ఇటీవల బీజేపీతో ఎన్నికల పొత్తు ఖరారు కావటంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెల్లుబుకుతోంది. అదే సమయంలో కొంత మంది నాయకులు బీజేపీతో పొత్తుపెట్టుకోవడంపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీతో పొత్తును వ్యతిరేకిస్తున్నవారిని బుజ్జగించి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం ఎలాంటి ప్రణాళికక రూపొందించాలనే విషయాలపై సమగ్రంగా చర్చించాలని ఈపీఎస్ నిర్ణయించారు. ఆ మేరకే మే 2న పార్టీ కార్యనిర్వాహక మండలి సమావేశం రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం 'ఎంజీఆర్ మాళిగై'లో జరుగుతుందని ఆయన ప్రకటించారు. పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ డాక్టర్ ఎ.తమిళ్‌మగన్ హుసేన్ అధ్యక్షతన ఈ సమావేశం మే 2 సాయంత్రం 4.30 గంటలకు జరుగుతుందని తెలిపారు. పార్టీ కార్యనిర్వాహక మండలి సభ్యులు ప్రధాన కార్యాలయం కార్యదర్శులు, జిల్లా శాఖ కార్యదర్శులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మహిళా విభాగం సభ్యులు తప్పకుండా ఈ సమావేశానికి హాజరుకావాలని, అందరికీ ఆహ్వాన పత్రాలను కూడా పంపామని ఆయన పేర్కొన్నారు.

పూర్తి రాష్ట్ర స్వయంప్రతిపత్తి సాధించుకుందాం

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోదా కోసం ప్రజాసామ్య యుద్ధభూమిలో డీఎంకే ప్రభుత్వం దృఢంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన 'ఎక్స్' పేజీలో పోస్ట్ చేసిన వివరాలిలా ఉన్నాయి... 50 ఏళ్ల క్రితం కలైంజర్ కరుణానిధి శాసనసభలో రాష్ట్ర స్వయంప్రతిపత్తి తీర్మానం ఆమోదించారని, ఆ చరిత్ర మళ్లీ పునరావృతం కానుందన్నారు. శాసనసభలో 110వ నిబంధన కింద ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాష్ట్ర స్వయంప్రతిపత్తి సాధించేందుకు చారిత్రాత్మక ప్రకటన చేశారన్నారు. రాష్ట్ర హక్కులు పరిరక్షించేలా మాజీ న్యాయమూర్తి కురియన్ జోసఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. కేంద్రంలో ఉన్న వారు రాష్ట్ర అధికారాలను చేజిక్కించుకుంటున్న సమయంలో, తమిళనాడు తన గొంతు బలంగా వినిపిస్తూనే ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేయడానికి ముందే అన్నాడీఎంకే సభ్యులు వాకౌట్ చేసి, కోలుకోలేని కళంకానికి గురయ్యారన్నారు. బీజేపీ సభ్యులు కూడా వాకౌట్ చేసి తమ యజమానుల పట్ల బానిసలుగా విధేయత ప్రదర్శించారని ఉప ముఖ్యమంత్రి విమర్శించారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తమిళ ఉగాది వేడుకలు



వేలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వేలూరు బేరిపేట సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం విశ్వావసు నామ తమిళ ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సభకు ముఖ్యఅతిథులుగా రాష్ట్రబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు కృష్ణమూర్తి హాజరుకాగా, జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాజా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముందుగా ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ గౌరవాధ్యక్షుడు అత్తిపట్టు గణేశ శాస్త్రి, విద్యాపీఠం సంస్కృత పాఠశాల ఉప అధ్యాపకులు భాస్కర్, ఉపాధ్యక్షులు వెంకట్, ప్రధాన కార్యదర్శి శేఖర్, కోశాధికారి రాజగోపాల్, ఆర్గనైజర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌లైఫ్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం



వేలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా అన్నైకట్టు డివిజన్‌లోని పొయిగై ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం గుడ్‌లైఫ్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వృద్ధులకు ఫౌండేషన్ అధ్యక్షులు విఘ్నేశ్వరన్ సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీ.ఎస్.ఐ ఫాదర్ ఆనంద్, లెక్చరర్ కోకిల తదితరులు ఆశ్రమం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారి మహాలక్ష్మి, ఇండియన్ రెడ్ క్రాస్ నిర్వాహకులు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో తమిళ ఉగాది వేడుకలు



తిరుత్తణి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా వెలిగిరం గ్రామంలోని గంగమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం తమిళ ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయ అర్చకులు అమ్మవారికి క్షీరాభిషేకం చేసి, పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు

రాష్ట్రంలో 1.58 లక్షల హెచ్ఐవీ బాధితులు

● మంత్రి సుబ్రమణ్యం

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుమారు 1.58 లక్షల మంది హెచ్ఐవీతో బాధపడుతున్నారని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం రాష్ట్ర శాసనసభ సమావేశం ప్రశ్నోత్తరాల సమయంలో హెచ్ఐవీ బాధితుల పింఛన్ పెంచాలని, అది ఒకే విధంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కడయనల్లూర్ ఎమ్మెల్యే కృష్ణన్‌కుమార్ కోరారు. అందుకు మంత్రి సుబ్రమణ్యం బదులిస్తూ... రాష్ట్రంలో 1,57,908 మంది హెచ్ఐవీ బాధితులున్నారని, వారికి 76 మల్టీ చికిత్సా కేంద్రాల నుంచి మందులు అందిస్తున్నామన్నారు. హెచ్ఐవీ బాధితుల పిల్లలకు విద్య, వైద్య ఖర్చుల నిమిత్తం మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి రూ.5 కోట్లు కార్పస్ ఫండ్‌గా కేటాయించారని, ఆ నగదు ప్రస్తుతం రూ.25 కోట్లకు పెంచామని తెలిపారు. హెచ్ఐవీతో బాధపడుతున్న 18 ఏళ్లలోపున్న 7,618 మంది పిల్లల విద్య, వైద్యానికి రూ.1.81 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. హెచ్‌వీఐ బాధితుల పిల్లలకు నెలవారీ ఉపకారవేతనం అందించే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మంత్రి తెలిపారు.

వేలూరులో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

● 'విమల్' వ్యవస్థాపకులు జీవీ.సంపత్



వేలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక కార్యక్రమం ఈ నెల 18వ తేదీన వేలూరు సమీపంలోని సేన్‌పాక్కంలోని రాజేశ్వరి మైదానంలో నిర్వహించనున్నామని విమల్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వ్యవస్థాపకులు జీవీ.సంపత్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జీవీ.సంపత్ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు, యువకులు అర్హులని తెలియజేశారు. ఆసక్తివున్నవారు తమ ఆధార్‌కార్డుతో క్రీడామైదానంలోని కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. వివరాల కోసం 7010594657 అనే నెంబరుకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

కొడనాడు కేసులో సయాన్‌కు సమన్లు

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కొడనాడు హత్య, దోపిడీ కేసులో నేరారోపణ లున్న మొదటి వ్యక్తి సయాన్‌కు సీబీసీఐడీ పోలీసులు సమన్లు జారీచేశారు. గురువారం (ఈ నెల 17వ తేది) కోవై సీబీసీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని సమన్లలో సూచించారు. సయాన్‌కు చెందిన ఐఫోన్, 7 అంకెల నెంబర్ల నుంచి వచ్చిన కాల్స్ వివరాలకు సంబంధించి సయాన్‌ను సీబీసీఐడీ పోలీసులు విచారించనున్నట్లు సమాచారం.

హెరాయిన్‌తో పశ్చిమ బెంగాల్ యువకుడి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి పరిసరాల్లో హెరాయిన్ విక్రయిస్తున్న పశ్చిమ బెంగాల్ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆవడి ప్రాంతంలో మాదకద్రవ్యాల విక్రయాలు అధికంగా ఉన్నాయనే ఫిర్యాదుతో అంబత్తూర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ నేతృత్వంలో సిబ్బంది సోమవారం ఆవడి కోనాంబేడు ప్రాంతంలో తనిఖీ చేశారు. ఆ సమయంలో అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన మొజమల్ షేక్ (21) ను అదుపోలకి తీసుకున్నారు. అతడి నుంచి 9 గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అతడిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

మాదకద్రవ్యాల విక్రయాలపై ఉపేక్షించొద్దు

● అధికారులకు కలెక్టర్ ఆదేశం



వేలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగర పరిసర ప్రాంతాల్లో ఇటీవల యువత వంతస్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, మాదక ద్రవ్యాల విక్రయాలను అడ్డుకునేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆదేశించారు. వేలూరు జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆధ్వర్యంలో అధికారులకు మత్తు పదార్థాల విక్రయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మదివానన్, ఏఎస్పీ శరవణన్, కార్పొరేషన్ కమిషనర్ జానకి రవిచంద్రన్, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి భరణిధరన్ పాల్గొన్నారు.

బస్సులో రూ.5 లక్షల చోరీ: దొంగ అరెస్ట్



నిందితుడు కదిర్‌వేల్

వేలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దగ్గర రూ.5లక్షలు చోరిచేసిన ఘటన తూత్తుకుడి సమీపంలో చేటుచేసుకుంది. వివరాలిలా... తూత్తుకుడికి చెందిన సెల్వకుమార్ (40) సోమవారం రాత్రి సమయంలో వ్యాపార నిమిత్తం రూ.5లక్షలు తీసుకుని ప్రభుత్వ బస్సులో వేలూరు బయలుదేరాడు. ఈ క్రమంలో అతడి దగ్గరవున్న నగదు సంచి మాయమైంది. ఖంగుతిన్న సెల్వకుమార్ వెంటనే దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే సమీపంలోని సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు కేవలం తొమ్మిది గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడిని విచారించిన పోలీసులు తేని జిల్లాకు చెందిన కదిర్‌వేల్ అని, సెల్వకుమార్ నిద్రిస్తున్న సమయంలో ఈ దొంగతనానికి పాల్పడ్డాడని తెలిపారు. కదిర్‌వేల్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు, కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

జీఆర్‌హెచ్ కల్యాణ మండపం ఆధ్వర్యంలో అన్నదానం



తిరుత్తణి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో తమిళ ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం జీఆర్‌హెచ్ కల్యాణ మండప యాజమాన్యం ఆ ప్రాంతంలో ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న సుమారు 1500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మండప నిర్వాహకులు మాట్లాడుతూ, గత 35 ఏళ్ళుగా ప్రతి ఉగాదికి ఆ ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని తెలిపారు

రోడ్డు పక్కన నిల్చున్న వారిపై దూసుకెళ్లిన కారు

● ఇద్దరు పిల్లల మృతి

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నిల్చున్న వారిపై కారు దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు పిల్లలు మృత్యువాతపడ్డారు. రామనాథపురం జిల్లా సాయల్‌కుడి అంకాళ పరమేశ్వరి ఆలయ వీధికి చెందిన స్వర్ణరాజన్ కుమార్తె షణ్ముగప్రియ (13), బంధువు హరి సూర్యప్రకాష్ (14)తో కలసి భద్రకాళి అమ్మవారి ఆలయంలో జరిగిన వేడుకలకు హాజరై, ఇంటి వెళ్లేందుకు ఈస్ట్‌కోస్ట్ రోడ్డు పక్కన నిల్చున్నారు. ఆ సమయంలో రామనాథపురం నుంచి తూత్తుకుడి వైపు వెళ్తున్న కారు, హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఆఇద్దరు పిల్లలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో షణ్ముగప్రియ ఘటనా స్థలంలోనే మృతిచెందగా, రామనాథపురం ప్రభుత్వాసుత్రిలో చికిత్స పొందుతూ హరిసూర్యప్రకాష్ కూడా మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన సాయల్‌కుడి పోలీసులు కర్ణాటక రాష్ట్రం పాండియాకు చెందిన కారు డ్రైవర్ శివ (45)ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

మంత్రి కేఎన్ నెహ్రూ సోదరుడికి వ్యతిరేకంగా కేసు

● ఈడీకి హైకోర్టు అనుమతి

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మంత్రి కెఎన్ నెహ్రూ సోదరుడికి వ్యతిరేకంగా నమోదైన కేసులో, మధ్యంతర పిటిషన్ దాఖలు చేసేందుకు ఈడీకి మద్రాసు హైకోర్టు అనుమతించింది. మంత్రి నెహ్రూ సోదరుడు ఎన్.రవిచంద్రన్ డైరెక్టర్‌గా ఉన్న సంస్థ 2013లో ఐవోబీ నుంచి రూ.30 కోట్లు రుణం పొందింది. ఆ రుణాన్ని మరో కంపెనీకి బదిలీ చేసినట్లు, దాని కారణంగా తమకు రూ.22.48 కోట్లు నష్టం ఏర్పడిందని బ్యాంక్ తరఫున ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో రవిచంద్రన్‌పై 2021లో సీబీఐ కేసు నమోదుచేసింది. ఈ కేసు ఆధారంగా మంత్రి నెహ్రూకు చెందిన ప్రాంతాల్లో ఈడీ తనిఖీలు చేపట్టింది. ఈ నేపథ్యంలో, ఎగ్మూర్ కోర్టులో విచారణలో ఉన్న కేసును రద్దు చేయాలని కోరుతూ రవిచంద్రన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా ఈడీ తరఫున హాజరైన న్యాయవాది... సీబీఐ కేసు ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసిందని, సీబీఐ కేసు రద్దు చేయాలనే పిటిషన్‌లో తమను కూడా చేర్చాలని వాదించారు. ఇందుకు పిటిషనర్‌తరఫు న్యాయవాది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వాదోపవాదాల అనంతరం, ఈ కేసులో మధ్యంతర పిటిషన్ దాఖలుకు ఈడీకి అనుమతి మంజూరు చేసిన న్యాయమూర్తి, తదుపరి విచారణ జూన్ 12వ తేదీకి వాయిదావేశారు.

తండ్రి మృతి.. పరీక్షకు కుమార్తె

అడయార్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా ముసిరి సమీపంలోని కోణంపట్టి గ్రామానికి చెందిన నిరంజన అనే విద్యార్థిని తండ్రి మృతిని దిగమింగుకుని మంగళవారం పదో తరగతి పరీక్షకు హాజరైంది. గ్రామానికి చెందిన మురళి (51) స్థానికంగా ఎరువుల దుకాణం నడుపుతుండగా ఆయన కుమార్తె నిరంజన ప్రస్తుతం పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతోంది. ఈ నేపథ్యంలో మురళి సోమవారం రాత్రి మృతి చెందారు. అయితే నిరంజనకు మంగళవారం పదో తరగతి పరీక్ష ఉండటంతో పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు హాజరైంది. పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్లు, నిరంజనకు ధైర్యం చెప్పి పరీక్ష బాగా రాయాలని సూచించారు. ఆ తర్వాత ఆ బాలిక తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది.

కోర్టుకు ఈపీఎస్ గైర్హాజరు

అడయార్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పరువునష్టం దావా కేసులో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి మంగళవారం కోయంబత్తూరు కోర్టుకు గైర్హాజరయ్యారు. కోవై ఆర్ ఎస్ పురం, తడక్కం రోడ్డుకు చెందిన కేసీ పళనిస్వామి అనే పారిశ్రామికవేత్త దివంగత జయలలిత జీవించివున్నపుడు అన్నాడీఎంకే ఎంపీగా వ్యవహరించారు. కోవై పర్యటనకు వచ్చిన ఎడప్పాడి తన గౌరవ మార్యదలకు భంగం కలిగించేలా ప్రసంగించారంటూ కేసీ పళనిస్వామి పరువునష్టం దావా వేశారు. ఈ కేసు విచారణ కోవై మొదటి జ్యూషియల్ మేజిస్ట్రేట్ (జేఎం-1) కోర్టులో గత ఒకటో తేదీన జరగ్గా, 15వ తేదీన ఎడప్పాడి హాజరుకావాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మరోమారు ఈ కేసు విచారణకు రాగా ఎడప్పాడి పళనిస్వామి కోర్టుకు హాజరుకాలేదు. దీంతో కేసు తదుపరి విచారణను వచ్చే నెల రెండో తేదీకి వాయిదా వేశారు.

దర్శకుడు ఎస్ఎస్ స్టాన్లీ కన్నుమూత


ఎస్.ఎస్.స్టాన్లీ (ఫైల్‌ఫొటో)

తమిళ చిత్రపరిశ్రమకు చెందిన సినీ దర్శకుడు ఎస్ఎస్ స్టాన్లీ (58) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన... మంగళవారం ఉదయం వలసరవాక్కంలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. శ్రీకాంత్ హీరోగా 2002లో వచ్చిన 'ఏప్రిల్ మాదత్తిల్' అనే చిత్రం ద్వారా దర్శకుడిగా అరంగేట్రం చేశారు. ఆ తర్వాత ధనుష్ హీరోగా 'పుదుక్కోట్టైయిలిరుందు శరవణన్', 'మెర్క్యురీ ఫ్లవర్స్', 'ఈస్ట్ కోస్ట్ రోడ్' చిత్రాలకు దర్శకత్వం వహించారు. దర్శకుడిగా రాణించిన ఎస్ఎస్ స్టాన్లీ ఆ తర్వాత నటనపై దృష్టిసారించారు. 2007లో జ్ఞాన రాజశేఖరన్ దర్శకత్వం వహించిన 'పెరియార్'లో అరింజ్ఞర్ అన్నా అనే పాత్ర పోషించారు. అనంతరం 'రావణన్', 'ఆండవన్ కట్టలై', 'సర్కార్', 'బొమ్మై నాయగి' వంటి చిత్రాల్లో నటించారు. 'ఆండవన్ కట్టలై'లో నకిలీ పాస్‌పోర్ట్ తయారు చేసే మోసగాడిగా నటించారు. విజయ్ సేతుపతి నటించిన 'మహారాజా' చిత్రంలో ఆయన చివరిసారిగా నటించారు. వలసరవాక్కంలోని విద్యుత్ శ్మశానవాటికలో అంత్యక్రియలను కుటుంబ సభ్యులు పూర్తిచేశారు. స్టాన్లీ మృతిపట్ల సినీ పరిశ్రమలోని పలువురు తమ ప్రగాఢ సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు.

18న 'రెట్రో' ఆడియో రిలీజ్


'రెట్రో'లో సూర్య - పూజా హెగ్డే

కార్తిక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య హీరోగా నటించిన 'రెట్రో' చిత్రం ఆడియో ఈ నెల 18న గ్రాండ్ రిలీజ్ చేయనున్నారు. మే ఒకటో తేదీన విడుదలకానున్న ఈ మూవీలో పూజా హెగ్డే, జయరాం, కరుణాకరన్, జోజూ జార్జ్ తదితరులు నటించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుటోంది. ఈ సినిమాలోని మూడు సాంగ్స్ రిలీజ్ చేయగా వాటికి మంచి ఆదరణ లభించింది. ఈ నేపథ్యంలో ఆడియో, ట్రైలర్ పెరియమేట్‌లోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో విడుదల చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈ చిత్రాన్ని సూర్య - జ్యోతిక, కార్తీక్ సుబ్బరాజ్ కలిసి 2డీ ఎంటర్‌టైన్మెంట్, స్టోన్ బెంచ్ పతాకంపై నిర్మించారు. ఇదిలావుండగా ఈ ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుకకు సూపర్‌స్టార్ రజనీకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

సేవలు నిలిపివేసిన అవుట్ డోర్ యూనిట్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

చిత్రజ్యోతి

తమిళ సినీ నిర్మాతల మండలికి, దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య ఫెఫ్సీకి మధ్య నెలకొన్న విభేదాలు తారస్థాయికి చేరుకున్న నేపథ్యంలో దక్షిణ భారత సినిమా, టీవీ ఔట్‌డోర్ యూనిట్ యూనియన్ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం నుంచి తమ సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ విషయంపై ఆ సంఘ నాయకులు వెల్లడించారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఔట్‌డోర్ యూనిట్ అనేది కెమెరా, లైట్స్, జనరేటర్, జిమ్మి, పేంథర్, క్రిప్స్, కెమెరాకు అవసరమైన విడిభాగాలను సినిమా, టీవీ సీరియల్స్ నిర్మాణం కోసం అద్దెకు ఇచ్చే యాజమాన్య అసోసియేషన్ అని వివరించారు. అయితే, ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి, కార్యదర్శి స్వామినాథన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గత ఆరేళ్ళుగా తమ వ్యాపారాన్ని దెబ్బతీసే చర్యలను చేపట్టారని వారు ఆరోపించారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు చెందిన ఔట్‌యూనిట్లను రాష్ట్రంలోని తీసుకొచ్చి ఇక్కడ ఉండే తమకు ఉపాధి లేకుండా చేశారన్నారు. తమిళం, తమిళ కార్మికుల కోసం పనిచేస్తున్నామని చెప్పుకుంటున్న ఆర్‌కే సెల్వమణి.. తమిళనాడుకు చెందిన మా కడుపులు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా తమిళ సినీ నిర్మాతల మండలికి, ఫెఫ్సీకి మధ్య చెలరేగిన వివాదం నేపథ్యంలో కొత్త సినీ నిర్మాణ కార్మిక సంఘం ఏర్పాటుకు నిర్మాతల మండలి మద్దతుగా నిలిచిందన్నారు. పైగా చిత్రపరిశ్రమకు చెందిన ప్రతి సభ్యుడు, సంఘం తాము చెప్పిన మాటే వినాలన్న ఆధిపత్య ధోరణితో ఆర్‌కే సెల్వమణి వైఖరి ఉందని, ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి సినిమా, టీవీ సీరియల్స్, వెబ్ సిరీస్, ప్రకటనల షూటింగ్‌లకు తమ ఔట్ డోర్ యూనిట్లను పంపించడం లేదని వారు ప్రకటించారు.

హైపర్ కాన్సెప్టులో హరీష్ కళ్యాణ్ కొత్త చిత్రం



హీరో హరీష్ కళ్యాణ్ నటించే కొత్త చిత్రం హైపర్ కాన్సెప్టులో తెరకెక్కనుంది. ఇది అతడి 15వ చిత్రం. ఐదా ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించే ఈ మూవీకి వినీత్ ప్రసాద్ దర్శకత్వం వహించనున్నారు. 'లిఫ్ట్' అనే మూవీతో ఆయన అందరి దృష్టిని తనవైపు తిప్పుకున్నారు. ఈ మూవీ అనౌన్స్‌మెంట్‌ను మంగళవారం అధికారికంగా ప్రకటించారు. వైవిధ్యభరితమైన కథా పాత్రలను ఎంచుకుంటూ సినీ కెరీర్ కొనసాగిస్తున్న హరీష్ కళ్యాణ్ సరసన ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటించనున్నారు. ఉత్తర చెన్నైలోని యువత జీవితాలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని రూపొందించనున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మించే ఈ చిత్రం చెన్నై, దాని పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటోంది. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు ప్రారంభించి, ఆడియో, ట్రైలర్‌తో పాటు విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

నేత్రపర్వంగా మారియమ్మన్ రథోత్సవం

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రధానమైన సమయపురం మారియమ్మన్ చిత్తిరై మహారథోత్సవం మంగళవారం ఉదయం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఆ ఆలయంలో వార్షిక చిత్తిరై బ్రహ్మోత్సవాలు ఈ నెల 6న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారు పల్లకీలో భక్తులను అనుగ్రహించారు. సోమవారం రాత్రి సమయపురం తీర్థ కొలను సమీపంలోని సూరప్పనాయకర్ మండపంలో అమ్మవారు సర్వాలంకరణశోభితురాలై వేంచేసి భక్తులతో పూజలందుకున్న అనంతరం రజతఅశ్వవాహంలో ఊరేగారు.ఈఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం మంగళవారం ఉదయం ప్రారంభమైంది. అమ్మవారు రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేకపీఠంపై ఆశీనులయ్యారు. రథానికి ఇరువైపులా మోకుతాళ్లను పట్టుకుని లాగుతూ భక్తులు 'ఓంశక్తి...పరాశక్తి' అంటూ నినాదాలు చేశారు. ప్రధాన వీధులలో రహదారికి ఇరువైపులా నిలిచిన వేలాదిమంది భక్తులు తన్మయత్వంతో తిలకిస్తుండగా అమ్మవారి రథం మంగళవాయిద్యాలు, చండీమేళం నడుమ ఊరేగింది. రథం వెళ్లే రహదారిలో ఏవైపు చూసినా పసుపు వస్త్రాలు ధరించిన భక్తులే కనిపించారు. రథం వెనుకనే భక్తులు క్షీరకలశాలు మోస్తూ, అగ్ని కలశాలు పట్టుకుని, పరవైకావళ్లమోస్తూ ఊరేగింపుగా వెళ్ళారు. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి సోమవారం ఉదయం నుండే రాష్ట్రం నలుమూలల నుండి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పాదయాత్రగా తరలివచ్చిన భక్తులకు తిరువానైక్కావల్, కొల్లిడం టోల్‌గేట్, పలూరు, సమయం తదితర ప్రాంతాల్లో భక్తజనసంఘాలు, ఆలయ నిర్వాహకులు, వ్యాపార సంఘాల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తుల కోసం తిరుచ్చి, సమయపురం ప్రాంతాల నుండి ప్రధాన నగరాలకు ప్రత్యేక బస్సులు నడిపారు. బుధవారం అమ్మవారు రజత కామధేను వాహనంలో, గురువారం ముత్యాల పల్లకీలో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ నెల 18 సాయంత్రం అమ్మవారి అభిషేకం, రాత్రి 7 గంటలకు వసంత మండపంలో తెప్పోత్సవ దీపారాధన జరుగనున్నాయి.


రథమండప ప్రాంతం నుంచి బయలుదేరుతున్న మహారథం. ఇన్‌సెట్‌లో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


పూలకావడి మోస్తున్న భక్తుడు - క్షీర కలశాలతో వస్తున్న మహిళలు

ప్రతి ఒక్కరూ దైవ సేవలో నిమగ్నం కావాలి

● గణపతి సచ్చిదానంద పిలుపు

అడయార్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో జరిగే ప్రతి మార్పునకు ఆ దేవుడే ప్రధాన కారణమని, అందువల్ల ప్రతి ఒక్కరూ దేవుడి సేవలో నిమగ్నం కావాలని అవదూత మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి పిలుపునిచ్చారు. సోమవారం తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన భక్తులకు ఆశీస్సులు అందజేసి అనుగ్రహ భాషణం చేశారు. ప్రతి ఒక్కరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఆయన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... విశ్వావసు నామ సంవత్సరం ప్రతి ఒక్కరికీ చాలా అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రకృతిలో జరిగే ప్రతి మార్పునకు దేవుడే ప్రధాన కారణమన్నారు. ఆధ్యాత్మిక, దైవిక శాంతి కోసం ఆలయాలు ఎంతో ముఖ్యమన్నారు. దేవుడికి సేవ చేయడం అంటే మానవాళికి సేవ చేయడమన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, అన్నదానం, విద్యాదానం ఇలాంటి వన్నీ దైవీక సేవలే అన్నారు. తమ ఆశ్రమంలో ఈ తరహా ఆధ్యాత్మిక బోధనలే జరుగుతాయన్నారు. దేశంలో ఎక్కడా లేని ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు ఒక్క తమిళనాడులోనే ఉన్నాయన్నారు. అలాగే, ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన విధంగా ఉండొచ్చని కానీ ఏ ఒక్కరికీ హాని చేయకూడదని పిలుపునిచ్చారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆ దేవుడుని ప్రార్థిస్తున్నట్టు గణపతి సచ్చిదానంద స్వామి పేర్కొన్నారు.


అనుగ్రహ భాషణం చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి

ఏఐ ఆధారిత డయాబెటిక్ రెటినోపతి స్క్రీనింగ్ ప్రారంభం

అడయార్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీ సెంటర్‌లో దేశంలోనే తొలిసారి ఏఐ (కృత్రిమమేథ) ఆధారిత డయాబెటిక్ రెటినోపతి స్క్రీనింగ్ కొత్తగా ప్రారంభించారు. డయాబెటిక్ నివారణ, సంరక్షణ, బలోపేతం చేసే లక్ష్యంతో డీఎండీఎస్‌సీ మార్గదర్శక స్క్రీనింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ చైర్మన్ డాక్టర్ వి.మోహన్ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు దాని సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తమ వద్దకు వచ్చే రోగులకు అత్యాధునిక వైద్య పరికరాలతో మెరుగైన సేవలందించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఏఐ ఆధారిత డయాబెటిస్ రెటినోపతి స్క్రీనింగ్ అనేది అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, సమస్యలను ముందుగానే గుర్తించడం, ఖచ్చితమైన ఫలితాలతో రోగులకు చికిత్స అందించేందుకు వీలుపడుతుందన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పోలీస్ గ్రీవెన్స్‌లో 60 వినతులు

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా బాధ్యలు చేపట్టిన అరుణ్, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి బుధవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. అలాగే పోలీసు శాఖ అధికారులు, పోలీసులు, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారు తమ సమస్యలు తెలిపేలా ప్రతి మంగళవారం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించి శిబిరంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఐదుగురు సీఐలు, పదిమంది ఎస్ఐలు, 45 మంది పోలీసులు హాజరై బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనం తగ్గింపు సహా పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

అయోధ్య శ్రీరాముడికి వెండి కిరీటం


వెండి కిరీటం నమూనా

పెరంబూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయానికి అఖిల భారత హిందూ మహాసభ తరఫున 2 కిలోల వెండి కిరీటం అందించనున్నారు. ఈ మహాసభ ఆధ్వర్యంలో గత ఏడాది అయోధ్య శ్రీరాముడు ఆలయానికి 1.75 కిలోల బరువుతో తయారుచేసిన రామ పాదం అందజేయగా, ప్రస్తుతం శ్రీరాముడికి 2 కిలోల వెండి కిరీటం అందించనున్నారు. అనుప్పర్‌పాళయంలో తమిళ నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం కిరీటం తయారీ ప్రారంభించారు. ఈ 26వ తేది తిరుప్పూర్ రానున్న మహాసభ జాతీయ అధ్యక్షుడు చక్రపాణి మహారాజ్ నేతృత్వంలో అవినాశి లింగేశ్వర ఆలయంలో వెండి కిరీటానికి ప్రత్యేక పూజల అనంతరం అయోధ్య రామాలయానికి తరలించనున్నట్లు మహాసభ యువజన విభాగం వల్లైబాలా, రాష్ట్ర ఐటీ విభాగం కార్యదర్శి సతీష్ తెలిపారు.

నగరంలో హై లైఫ్ ఎగ్జిబిషన్- 2025 ప్రారంభం


ప్రదర్శన ప్రారంభిస్తున్న ప్రముఖులు

అడయార్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేటలోని ప్రముఖ నక్షత్ర హోటల్‌లో హై లైఫ్ ఎగ్జిబిషన్-2025 మంగళవారం ప్రారంభమైంది. నటి దివ్య కృష్ణన్, ఫ్యాషన్ రంగ నిపుణులు అబి డొమినిక్, ప్రియాంక సబూ, అర్చన కిషోర్ తదితరులు కలిసి ఈ ప్రదర్శన ప్రారంభించారు. దేశంలోని ప్రముఖ ఫ్యాషన్, జీవన శైలి ప్రదర్శన బ్రాండ్‌గా గుర్తింపు పొందిన హై లైఫ్ ఎగ్జిబిషన్‌లో వందకుపైగా ప్రముఖ డిజైనర్లు, లైఫ్‌స్టైల్ బ్రాండ్లు, సమ్మర్ కలెక్షన్స్, ప్రత్యేకమైన డిజైన్లు, బ్రాండెడ్ దుస్తులు, లగ్జరీ ఆభరణాలు, విలాసవంతమైన ఉపకరణాలను ప్రదర్శన, విక్రయానికి ఉంచారు. బుధవారం వరకు జరిగే ఈ ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హిజ్రాలకు సేవా అవార్డుల ప్రదానం

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిజ్రాల సంక్షేమానికి పాటుపడే హిజ్రాలకు ప్రదానం చేసే సేవా అవార్డులకు ఈ యేడాదికిగాను నామక్కల్ జిల్లాకు చెందిన రేవతి, తూత్తుకుడి జిల్లాకు చెందిన పొన్ని ఎంపికయ్యారు. రాష్ట్ర సచివాలయంలో హిజ్రాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో వీరిద్దరికి ముఖ్యమంత్రి స్టాలిన్ సేవా అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డు క్రింద రూ.లక్ష నగదు, ప్రశంసా పత్రాన్ని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతా జీవన్, సామాజిక సంక్షేమ శాఖ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్, ఆ శాఖ కమిషనర్ ఆర్ లిల్లీ తదితరులు పాల్గొన్నారు.


తూత్తుకుడి జిల్లాకు చెందిన హిజ్రా పొన్నికి అవార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

కుంభకోణం చక్రపాణి ఆలయానికి

రూ.25లక్షల స్వర్ణకిరీటం

చెన్నై, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కుంభకోణంలోని సుప్రసిద్ధ చక్రపాణి ఆలయంలోని ఉత్సవమూర్తికి రూ.25లక్షల విలువైన స్వర్ణకిరీటాన్ని సుదర్శన భక్తజనం తరఫున జీఎస్ గిరి, పి.అనంతరామన్, మురళీధరన్, ఎన్.కృష్ణన్ తదితరులు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అనంతరం చక్రపాణి స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి ఆ స్వర్ణ కిరీటాన్ని ఉత్సవమూర్తికి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రవిచంద్రన్, ట్రస్టీ గీతా అశోక్, సుదర్శన భక్తజన సంఘం వ్యవస్థాపకుడు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


స్వర్ణకిరీటాన్ని అందజేస్తున్న ఉభయదారులు

ఛాన్సలర్ హోదాలో స్టాలిన్ అధ్యక్షతన

నేడు వైస్ ఛాన్సలర్ల సమావేశం



టి.నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన ఈ నెల 16న చెన్నైలో రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల సమావేశం జరుగనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సమావేశానికి ఛాన్సలర్ హోదాలో ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షత వహిస్తారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకూ విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా ఉన్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రతియేటా ఉన్నత విద్యావిషయాలపై చర్చలు జరిపేందుకు వీసీల సమావేశం నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం శాసనసభలో ఆమోదించి పంపిన పది బిల్లులను యేళ్లతరబడి పెండింగ్‌లో ఉంచిన గవర్నర్ నిర్లక్ష్య ధోరణిని ఖండిస్తూ ఆ బిల్లులకు తనకున్న విచక్షణాధికారం ద్వారా ఆమోదం తెలుపుతూ తీర్పునిచ్చింది. ఆ పది బిల్లుల్లో విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ బాధ్యతలను రాష్ట్ర ముఖ్యమంత్రికి అప్పగించేలా శాసనసభలో ఆమోదించిన బిల్లు కూడా ఉంది. ఈ మేరకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ముఖ్యమంత్రి స్టాలిన్ విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా పనిచేస్తారంటూ ప్రభుత్వ గెజిట్‌లోనూ పొందుపరిచారు. ఆ పది బిల్లులూ చట్టాలుగా అమలులోకి వచ్చాయని ఆ గెజిట్‌లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా ప్రస్తుతం ఖాళీగా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లను భర్తీ చేయడానికి చర్యలు చేపడుతున్నారు. ఆ మేరకు వీసీల ఎంపిక కోసం సిండికేట్ సభ్యులను నియమించనున్నారు. ఆ దిశగా తదుపరి చర్యల కోసం ఈ నెల 16న సచివాలయం సమీపంలోని నామక్కల్ కవింజర్‌మాళిగైలో వైస్‌ఛాన్సలర్ల సమావేశం జరుగనుందని ప్రభుత్వం ఆ ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర విశ్వవిద్యాలయాల చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి అధ్యక్షతన వైస్‌ఛాన్సలర్ల సమావేశం జరుగనుండటం విశేషం.

శ్రీసిటీలో 'వందే భారత్' స్లీపర్ బోగీల ఇంటీరియర్ పనులు

శ్రీసిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'వందే భారత్' స్లీపర్ ఎక్స్‌ప్రెస్ కోసం వివిధ వ్యవస్థలను రూపొందించడం, రైలు పెట్టెల్లో అమర్చడం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును తిరుపతి జిల్లా శ్రీసిటీలోని బీఎఫ్‌జీ ఇండియా చేపట్టింది. ఈ ప్రాజెక్టులో 16 కోచ్‌ల రైలు కోసం ఇంటీరియర్స్, మాడ్యులర్ టాయిలెట్ క్యాబిన్లు, ఏరోడైనమిక్ ఫ్రంట్ ఎండ్‌ల రూపకల్పన, తయారీ, ఇన్‌స్టాల్ చేయడం వంటి పనులను ఈ కంపెనీకి అప్పగించారు. ఈ రైలులో 823 బెర్త్‌లు, 51 టాయిలెట్లు ఉంటాయి. కాగా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో తేలికైన, మన్నికైన ఉత్పత్తులతో రైల్వే మౌలిక సదుపాయాలను కల్పించే విప్లవాత్మక వందే భారత్ స్లీపర్ ప్రాజెక్టులో భాగం కావడం తమకు గర్వకారణమని బీఎఫ్‌జీ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కె.ప్రేమమూర్తి తెలిపారు.


జస్టిస్ మురళి పురుషోత్తమన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మురళి పురుషోత్తమన్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఉన్నారు.


పరిటాల సునీత

సర్వదర్శనానికి 11 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని అన్ని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.58 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,078

తలనీలాలు సమర్పించినవారు: 25,831

తిరుపతి కళాకారులకు 'కందుకూరి' అవార్డులు

- శాంభోళ హరినాథ్, కృష్ణమూర్తి, వివేక్ ఎంపిక
- నేడు విజయవాడలో పురస్కారాల ప్రదానం

తిరుపతి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కందుకూరి అవార్డులకు తిరుపతికి చెందిన ముగ్గురు రంగస్థల కళాకారులు ఎంపికయ్యారు. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి వేడుకలు, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి పురస్కారాలకు శాంభోళ హరనాథ్, కృష్ణమూర్తి, పత్తిపాటి వివేక్‌ను ఎంపిక చేసినట్టు మంగళవారం ఏపీఎఫ్‌డీసీ ప్రకటించింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగే తెలుగు నాటకరంగ దిన వేడుకల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పురస్కారాలు అందజేయనున్నారు. ఒక్కొక్కరికి రూ10వేలు జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానించనున్నారు.

భళా శాంభోళ



శాంభోళ హరినాథ్ ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయుడు. కానీ, ఆయన కళాకారుడిగానే అందరికీ పరిచయం. 1976లోనే వేషం వేసుకుని ప్రథమ బహుమతి పొందారు. హాస్యాన్ని అలవోకగా, ఆశువుగా చెప్పగల చమత్కారి. అతను వేదిక ఎక్కితే నవ్వువచ్చేస్తుంది. అలాగని హాస్యానికే పరిమితం కాలేదు. కొన్ని సాంఘిక నాటికల్లో కన్నీరు తెప్పించిన అనేక పాత్రలను పోషించి విభిన్న నటుడిగా గుర్తింపు పొందారు. బెస్ట్ కమెడియన్‌గా అవార్డులు అందుకున్నారు. ఆయనకు వచ్చిన జ్ఞాపికల కోసం ఓ గదిని అద్దెకు తీసుకొని, అందులో అందంగా పేర్చి వాటిని చూసుకుంటూ ముచ్చటపడుతుంటారంటే రంగస్థలంపై ఆయనకున్న ప్రేమను తెలియజేస్తుంది.

కళా కృష్ణమూర్తి



ఎంకాం, ఎంబీఏ పూర్తిచేసి స్విమ్స్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఉన్నారు. అక్కడ పనిచేసే 8 గంటలూ రోగుల సేవలోనే ఉంటారు. బయటకు వస్తే నటన గురించే ఆలోచిస్తారు. తొలినాటకం 'భక్త కన్నప్ప'లో నటించారు. 'పాండవోద్యోగ విజయం'లోని ఉపప్లావ్య ఘట్టంలో తొలిసారిగా కృష్ణుడి పాత్ర వేశారు. చెంచితలో చెంచునాయుడు పాత్రలో కృష్ణమూర్తి ఒదిగిపోయారు. 'తరిగొండ వెంగమాంబ' నాటకంలో శివగురు పాత్రతో విలనిజం చూపించారు. బుల్లితెరపై మొగలిరేకులు, హరిలోరంగహరి, కుమ్మరి భీమన్న, భీష్మ, అపార్ట్‌మెంట్ వంటి సీరియల్స్ చేశారు. పేరుకు తగ్గట్టే శ్రీకృష్ణుడు, కుసాలన్న పాత్ర, కాళహస్తి మహత్యంలో కాశీపాత్ర (హాస్యం) గుర్తింపు తెచ్చాయి. తరిగొండ వెంగమాంబ, పాండవోద్యోగం నాటకాలు పేరు తెచ్చాయి.

మైమ్ స్టార్ వివేక్



శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ సాంస్కృతిక కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్. విద్యార్థిగా ఉన్నప్పుడే మైమ్‌స్టార్‌గా పేరుతెచ్చుకున్నారు. 2022లో 'నాటిక' రచనకు బంగారు నంది అవార్డు అందుకున్నారు. విశ్వవిద్యాలయాల మధ్య జరిగే అనేక సాంస్కృతిక పోటీల్లో వివేక్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. మైమ్ ద్వారా అద్భుతమైన సందేశాలిచ్చేవారు. ఇటీవల వర్సిటీలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. అందులోని విజేతలను, దక్షిణ భారత విశ్వవిద్యాలయాల్లో ఎస్వీయూను అగ్రస్థానంలో నిలిపారు. ఎస్వీయూ చరిత్రలో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారు.

ధాన్యం పైనా సూర్యప్రతాపం

- అధిక ఉష్ణోగ్రతల్లో ఆరబెడితే నష్టమే
- అధికంగా ఎండితే బియ్యం ముక్కలయ్యే అవకాశం
- కొంత పచ్చిగా ఉన్నప్పుడే పంటకోత మేలంటున్న వ్యవసాయ అధికారులు


తేమ శాతం తగ్గించేందుకు ఎండలో ఆరబెట్టిన ధాన్యం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తూర్పు మండలాల్లో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం అమ్మకాలకు రైతులు సిద్ధపడుతున్నారు. 17 శాతం వరకు తేమ ఉన్న ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో పచ్చిగా ఉన్నప్పుడే అమ్ముకుంటే గిట్టుబాబు ధర రాదని భావిస్తున్న రైతులు.. ధాన్యాన్ని ఎండలో బాగా ఆరబెట్టి తేమను తొలిగించే పనిలో పడ్డారు. కోత దశకు వచ్చిన పంటను కోత కోసి వచ్చిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. సరిగ్గా ఇదే తరుణంలో ఈ ఏడాది మార్చి నుంచే ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది. సూళ్లూరుపేట ప్రాంతంలో దాదాపు 35 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటువంటి వాతావరణ పరిస్థితుల్లో ధాన్యం అధికంగా ఎండిపోయే అవకాశం ఉంటుంది. ఇదే జరిగితే బియ్యం ముక్కలయ్యే అవకాశం ఏర్పడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీని వల్ల రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి నిరాకరించే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- వరి కంకుల్లో 90 శాతం గింజలు పసుపు రంగుకు మారుతున్నప్పుడు, కర్ర పచ్చిగా ఉండగానే పంట కోయాలి.
- పంట పక్వానికి వచ్చాక కోత ఆలస్యం చేయకూడదు.
- పంటను ముందుగా కోస్తే ధాన్యంలో పచ్చి గింజలు ఎక్కువగా ఉండి మిల్లింగ్ సమయంలో అధికంగా నూక వస్తుంది.
- ఎండ తక్కువ తగిలే చోట ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలి.
- 17 శాతం తేమ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ధాన్యం ఎక్కువగా ఎండినా బియ్యంలో నూక శాతం ఎక్కువ అవుతుంది.


ఆరబెట్టేందుకు ట్రాక్టర్‌లో తీసుకొచ్చి పోస్తున్న ధాన్యం


ఆరిన ధాన్యం రాశులు

విజబుల్ పోలీసింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తే సహించను

పనితీరు మార్చుకోని వారిపై కఠిన చర్యలు ● అధికారుల సమీక్షా సమావేశంలో ఎస్పీ హెచ్చరిక



పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 'ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం పెరగాలంటే విజబుల్ పోలీసింగ్‌ను బాధ్యతగా నిర్వహించాలి. ఈ విషయంలో కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారు పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవు' అని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. తిరుపతిలో మంగళవారం ఆయన జిల్లాలోని అదనపు ఎస్పీలు, డీఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా ఓపెన్ బూజింగ్, పరిసరాల పరిశుభ్రత, విజబుల్ పోలీసింగ్, పల్లెనిద్ర, ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం, పార్కుల్లో వాకింగ్ చేస్తున్న వృద్ధులతో పోలీసు కార్యక్రమాలను ప్రతిరోజు పక్కాగా నిర్వహించాలన్నారు. వీటిపై ఎలాంటి స్పందన వస్తోందనేది డీఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. రాంగ్ రూట్‌లో వెళుతున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తే వారు సంఘ వ్యతిరేక శక్తులుగా మారతారన్నారు. ప్రజలకు మనోధైర్యం కల్పించేలా పనిచేయాలే కానీ ఇబ్బంది పెట్టేవిధంగా కాదని పోలీసులకు సూచించారు. సబ్ డివిజన్ల పరిధిలో నమోదవుతున్న.. పెండింగ్ కేసులపై ఆరాతీశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు ఎందుకు ఛేదించలేకపోతున్నారని ప్రశ్నించారు. అన్ని దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమయం దాటాక ఎవరైనా మద్యం తాగుతూ కనిపిస్తే పోలీస్ ట్రీట్‌మెంట్ గట్టిగా ఇవ్వాలన్నారు. నైట్‌బీట్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. శక్తి యాప్‌పై నిర్వహించే అవగాహన కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. త్వరలో సిబ్బందిని పారదర్శకంగా బదిలీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, రామకృష్ణ, డీఎస్పీలు, ఎస్పీ సీఐ షాదిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తూలి కిందపడ్డ సూళ్లూరుపేట ఎమ్మెల్యే

- విజయశ్రీకి స్వల్ప గాయాలు
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే ఇంట్లో ఘటన

తడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తూలి కిందపడడంతో స్వల్ప గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో మంగళవారం జరిగిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు విజయశ్రీ వెళ్లారు. కారుదిగి ఇంట్లోకి వెళ్తున్న క్రమంలో ప్రధాన గడప వద్ద తూలి కింద పడిపోయారు. ముఖం నేలకు కొట్టుకుని స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వెంటనే వచ్చి విజయశ్రీని పైకి లేపారు. గాయమైన చోట రక్తం కారుతుండడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు కుట్లు వేసి చికిత్స అందించారు. కొద్దిసేపు అక్కడే విశ్రాంతి తీసుకున్న విజయశ్రీ సాయంత్రం నాయుడుపేటలోని స్వగృహానికి వచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెను పరామర్శించారు.

నేడు అసెంబ్లీ పద్దుల కమిటీ రాక

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం అసెంబ్లీ పద్దుల కమిటీ రానుందని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ పద్దుల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావుతో పాటు 11మంది సభ్యుల బృందం బుధవారం ఉదయం 5.15గంటలకు తిరుపతి పద్మావతి అతిథి గృహం వద్దకు చేరుకుంటారన్నారు. 11గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి చిత్తూరు జిల్లాలో సమీక్షలో పాల్గొని రాత్రి 7.30గంటలకు తిరుమల చేరుకుంటారని తెలిపారు. గురువారం ఉదయం స్వామివారిని దర్శించుకుని 11.30గంటలకు తిరుపతి పద్మావతి అతిథిగృహంలో ఈవో శ్యామలరావు, ఇతర అధికారులతో సమీక్షా నిర్వహించి సాయంత్రం 5.15గంటలకు విజయవాడకు తిరుగు పయనం కానున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రాణదాన పథకానికి 194 మంది ఎంపిక

తిరుపతి(వైద్యం),ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచిత శస్త్ర చికిత్సలు అందించే టీటీడీ ప్రాణదాన పథకానికి 194 మంది రోగులను ఎంపిక చేశారు.స్విమ్స్‌లో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో మంగళవారం ప్రాణదాన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియాలజీ 1, కార్డియోథొరాసిక్ 18, ఈఎన్‌టీ 8, జనరల్ సర్జరీ 1, మెడిసిన్ 12, నెఫ్రాలజీ 39, న్యూరాలజీ 23, న్యూరోసర్జరీ 29, గైనకాలజీ 23, సైకియాట్రీ 1, సర్జికల్ ఆంకాలజీ ముగ్గురు రోగులను కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. పేద రోగులకు ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించే టీటీడీ ప్రాణదాన పథకానికి దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తే మరింత మందికి వైద్యం అందించే అవకాశం ఉంటుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ రామ్, వైద్య విభాగాధిపతులు శివశంకర్, గోపీ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'స్కిట్'ను పునఃప్రారంభిస్తాం

మరో ఆరు నెలల్లో రానున్న పది పరిశ్రమలు ● మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 'మరో 20 రోజుల్లో 'స్కిట్' (శ్రీకాళహస్తీశ్వరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో మరమ్మతులు ప్రారంభం కానున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారంభిస్తాం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తిలో స్కిల్ డెవలప్‌మెంట్ సహాయంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. అభివృద్ధే ఆశయంగా తుది శ్వాస వరకు ప్రజల కోసం గోపాలకృష్ణారెడ్డి పరితపించారన్నారు. 30కి పైగా ఎంఎన్‌సీ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ యువతకు స్థానిక పరిశ్రమల్లో 33శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ నెరవేరుస్తున్నామన్నారు. తొట్టంబేడు, శ్రీకాళహస్తి, మండలం, ఏర్పేడు, రేణిగుంటలో విస్తారంగా ప్రభుత్వ భూములున్నాయన్నారు. మరో ఆరు నెలల్లో సుమారు పది పరిశ్రమలు ప్రారంభించేలా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనతో అభివృద్ధి, ఉద్యోగాల కల్పనతో యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్న తపనతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టిసారిస్తున్నారని చెప్పారు. తరచూ సీఎం చంద్రబాబు కలెక్టర్ల సమావేశంలో కొత్త పరిశ్రమల కోసం భూముల పరిశీలన సాగిస్తూ ఎప్పటికప్పుడు యువతకు జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని సూచిస్తున్నట్లు తెలిపారు. త్వరలో జిల్లాస్థాయి జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఈ జాబ్ మేళాకు సుమారు రెండు వేల మంది నిరుద్యోగులు వచ్చారు. 1,788మంది 33ఎంఎన్‌సీ కంపెనీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 712మందికి అప్పటికప్పుడు నియామకపత్రాలు అందాయి. 305మంది దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ అధికార ప్రతినిధి గురవారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు, దశరధాచారి, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్యనాయుడు, బొల్లినేని జగన్నాధంనాయుడు, మునిరాజానాయుడు, కంఠా రమేష్, రవీంద్రారెడ్డి, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.





జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు - 2014-19లో సీఎం చంద్రబాబు, అప్పటి ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యాన శ్రీకాళహస్తి నియోజకవర్గానికి తీసుకొచ్చిన పరిశ్రమలతో తయారు చేసిన జ్ఞాపికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పూలవనంలో జెర్రిపోతు



తిరుమల, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీవారిసేవా సదన్‌కు సమీపంలోని పూలవనంలోకి ఏడు అడుగుల పొడవైన జెర్రిపోతు ప్రవేశించింది. గుర్తించిన కార్మికులు వెంటనే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన పామును చాకచక్యంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టాడు.